క్లుప్తంగా

11 వరకూ లేపాక్షిలో ఎగ్జిబిషన్



లెదర్ పప్పెట్‌తో చేసిన వస్తువులను విక్రయిస్తున్న సిబ్బంది

సీటీఆర్‌ఐ: లేపాక్షి ఎంపోరియంలో ఈనెల 7 నుంచి నిర్వహిస్తున్న దీమెటిక్ ఎగ్జిబిషన్‌కు అద్భుత స్పందన వస్తోందని లేపాక్షి నగర సంస్థ మేనేజర్ మోనిక అన్నారు. ఆమె గురువారం ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వివరాలను తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకూ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. వైట్‌వుడ్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేదర్ పప్పెట్, కళంకారి వస్తువులను తయారీదారులే లేపాక్షి షోరూమ్‌లో విక్రయిస్తున్నారన్నారు. అలాగే దీపావళి సందర్భంగా దీపాలను కూడా విక్రయిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: మండలంలోని పొట్టిలంక గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. వార్షిక విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా 33 కేవీ చొప్పెల్ల, కడియపులంక ఫీడర్, 11 కేవీ పొట్టిలంక ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ పొట్టిలంక గ్రామానికి సరఫరా ఉండదన్నారు.

రేపు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

రాజమహేంద్రవరం సిటీ: 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నామని ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రయాణికులు 9959 2255 35 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. డిపో అభివృద్ధి, బస్సు సర్వీసులు, పార్సిల్ రవాణా అంశాల్లో సూచనలు స్వీకరిస్తామని వివరించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సీటీఆర్‌ఐ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ గౌతమీ ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి జి.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు.

28 నుంచి సమ్మేటివ్ పరీక్షలు

కంబాలచెరువు: అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతుల విద్యార్థులకు ఈనెల 28వ తేదీ నుంచి సమ్మేటివ్ 1 పరీక్షలు నిర్వహిస్తామని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టోరేజ్ పాయింట్‌కు చేరిన ప్రశ్నపత్రాలను గురువారం భద్రపరిచారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులు ఆయా తేదీల్లో నిర్వహించే సబ్జెక్టు ప్రశ్నపత్రాలను ట్రంక్ పెట్టెలలో భద్రపరచడం జరిగిందన్నారు. ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో సమ్మేటివ్ పరీక్షలు 28కి వాయిదా పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కోటేశ్వరి, కుమారి, ఇందిర, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఒకటిన ఆర్ట్స్ కళాశాలలో వర్క్‌షాప్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిసెంబర్ ఒకటో తేదీన సాంఖ్యక పద్ధతులపై విశ్లేషణ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్లు డాక్టర్ మాధవి, కె.దుర్గారావు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : జిగర్‌తండ
సూర్యమినీ : ది మార్వెల్స్
సూర్యప్యాలెస్ : జిగర్ తండ
స్వామి : టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి : మాఊరి పొలిమేర–2
అనుశ్రీ : భగవంత్ కేసరి
రాజా : జపాన్
అశోక : జపాన్
ఊర్వశి : కీడాకోలా
రంభ : జపాన్
మేనక : లియో
అప్సర : ది మార్వెల్స్, మాఊరి పొలిమేర–2
నామవరం
వీఎస్ మహల్ : జిగర్‌తండ, జపాన్
ధవళేశ్వరం
మురళీకృష్ణ : జపాన్
కడియం
వెంకటసూర్య : జిగర్ తండ, జపాన్

జగన్‌తోనే అభివృద్ధి

- ఆయన పాలన స్వర్ణయుగం
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న పాలన స్వర్ణయుగమని, రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన ఘనత ఆయనకే దక్కిందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 2వ డివిజన్ గోపాల్ నగర్ పుంత 5వ సచివాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. 5వ సచివాలయం పరిధిలో మొత్తం 3,450 మంది జనాభా ఉంటే వారిలో పేదరికమే అర్హతగా 80 శాతం మందికి వివిధ పథకాల ద్వారా సుమారు రూ.10.6 కోట్లు ప్రభుత్వ లబ్ధి పొందారన్నారు. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.4 కోట్లు మొత్తం రూ.14,73,06,282 ప్రజలకు అందజేశారన్నారు. ఇంతటి సంక్షేమాన్ని అందించినందుకే మళ్లీ సీఎంగా జగనన్నే ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. గత టీడీపీ చంద్రబాబు హయాంలో పేదలను కానీ, రాష్ట్ర అభివృద్ధిని కానీ పట్టించుకోలేదన్నారు. సీఎంగా జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా నిరంతరం పాటుపడుతూనే ఉన్నారన్నారు. సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ఇంటికే సంక్షేమం అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎంపీ భరత్ రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. అలాగే నగరంలోని 10, 31వ డివిజన్లలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర గాండ్ల, తెలికుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, మానే దొరబాబు, అజ్జరపు వాసు, ఏవీ రమణ, వాకచర్ల కృష్ణ, మజ్జి నూకరత్నం పాల్గొన్నారు.



కాతేరులో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, తాటికొండ విష్ణుమూర్తి, పార్టీ నాయకులు



16వ డివిజన్‌లో మాట్లాడుతున్న పాలిక శ్రీను



2వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్



దుళ్లలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, చిత్రంలో స్థానిక నాయకులు, అధికారులు.

జనం కోసం తపించే నేత జగన్

కడియం: జనం కోసం తపించే నేత నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం దుళ్ల సచివాలయం 1 వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిదారుల వివరాల బోర్డు, జెండాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో దుళ్ల గ్రామంలో రూ.24 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గృహసారథులు, కన్వీనర్లు రోజుకు పది కుటుంబాలను కలిసి జగనన్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.రత్నకుమారి, నోడల్ ఆఫీసర్ వైవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

రూ.28.48 కోట్లతో అభివృద్ధి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామ సచివాలయం–2 పరిధిలో రూ.28.48 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూర్చినట్టు ఎంపీడీవో డి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం జరిగిన వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల జేసీఎస్ ఇన్‌చార్జి, పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణుమూర్తి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో గ్రామసచివాలయం పరిధిలో డీబీటీ 19.09 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 9.38 కోట్లతో ప్రజలకు ప్రయోజనం చేకూర్చడం జరిగిందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో సచివాలయం పరిధిలో అభివృద్ధి జరుగుతోందన్నారు. అనంతరం అధికారులు, సచివాలయ కన్వీనర్లు పెనుమాక సునీల్, ఆచంట రవీంద్రలతో కలిసి సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. సచివాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం పార్టీ నాయకులు గ్రామ సచివాలయం పరిధిలో నిద్రించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ తాడి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావు, సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట కళ్యాణ్, పార్టీ నాయకులు యెజ్జు వాసు, మానుకొండ వెంకట్రావు, మేకా సూర్యారావు, మద్దా దుర్గారావు, చీకట్ల రంజిత్, దిలీప్ కుమార్, నక్కా ధనరాజు, ఆచంట సాయిబాబా పాల్గొన్నారు.

16వ డివిజన్‌లో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్ వీరభద్రపురం వార్డు సచివాలయం పరిధిలో ప్రజలకు నాలుగున్నరేళ్ల కాలంలో రూ.19.54 కోట్ల లబ్ధి చేకూరిందని రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అన్నారు. గురువారం సాయంత్రం వీరభద్రపురం వార్డు సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నగరపాలకసంస్థ అధికారులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు.

మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి

- చందన నాగేశ్వర్ పుట్టినరోజు వేడుకల్లో నాయకులు
- పలు సేవాకార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పుట్టినరోజు వేడుకలను గురువారం పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీశ్రేణులు, అభిమానులు, అధికారులు, శ్రేయోభిలాషులు పాల్గొని చందన నాగేశ్వర్‌కు పుష్ప గుచ్ఛాలు అందజేశారు. పూలమాలలుతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పండితులు, పాస్టర్లు, ఇమామ్‌లు చందన నాగేశ్వర్‌ను ఆశీర్వదించి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. చందన నాగేశ్వర్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. శాటిలైట్‌సిటీకి చెందిన విద్యార్థిని చరితావాణికి సైకిల్‌ను, దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను చందన నాగేశ్వర్ చేతుల మీదుగా అందజేశారు. ఇటీవల మోకాలికి ఆపరేషన్ చేయించుకున్న పిడింగొయ్యి బాపూజీనగర్‌కు చెందిన షేక్ ఆలీషాకు రూ.15 వేలు అందించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని వలంటీర్లకు చీరలను ఆయా సచివాలయ కన్వీనర్ల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు డి.శ్రీనివాసరావు, కె.రత్నకుమారి, పార్టీ రాష్ట్రకార్యదర్శి మింది నాగేంద్ర, కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఏపీ ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్, పార్టీ జిల్లా కార్యదర్శులు రాజమౌళి, తాటికొండ విష్ణు, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, షేక్ షకీలా బేగం, భీమిరెడ్డి నాగేంద్ర, జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, మత్సేటి శివ పాల్గొన్నారు.



విద్యార్థినికి సైకిల్ పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్



ధవళేశ్వరంలో పేదలకు దుప్పట్లు పంపిణీ

పేదలకు దుప్పట్ల పంపిణీ

ధవళేశ్వరం: చందన నాగేశ్వర్ జన్మదిన వేడుకలను ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను కేక్ కట్ చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు ట్రస్ట్ సభ్యులతో కలిసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హితకారిణీ సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), తలారి వరప్రసాద్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, ముత్యాల జాన్, పేర్ల బాసి, పందెళ్ల భానుప్రసాద్, బోడపాటి కుమార్, బొడ్డేటి శివాజీ, గరగ శ్రీను, ఫణికుమార్, బాబీ, బర్రి సుబ్బారావు, గూటం రాజు పాల్గొన్నారు.

భావ కవుల జయంత్యుత్సవం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం కాశీపట్నం రామారావు, దువ్వూరి రామిరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ ఆధునిక భావకవుల స్మరణీయ సభను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అంశాలను కారా, దువ్వూరి రచనలలో కనిపిస్తాయన్నారు. తెలుగు అధ్యాపకురాలు షేక్ జరీనా మాట్లాడుతూ దువ్వూరి కర్షక కవి అని, అన్ని రచనలలో అన్నదాతలను మిళితం చేసే రచించారన్నారు.

వివాహిత మృతి

కంబాలచెరువు: కాతేరుకు చెందిన తోట ఆదిలక్ష్మి (37) అనే వివాహిత గురువారం రాత్రి తన ఇంట్లోని బాత్‌రూమ్‌లో కాలుజారి పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఆమె పెద్ద కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఓటు నమోదుకు 9 వరకూ అవకాశం

రాజానగరం: ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో ఓటు నమోదుకు డిసెంబరు 9 వరకూ అవకాశం ఉందని రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి తెలిపారు. 2024 జనవరి ఒకటి లేదా ఏప్రిల్ ఒకటి నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు హక్కు పొందవచ్చన్నారు. ఇందుకుగాను ఫారమ్ 6లో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. అలాగే మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగింపునకు ఆయా కుటుంబ సభ్యుల అనుమతితో ఫారమ్ 7, సవరణలు, పోలింగ్ బూత్‌ల మార్పునకు ఫారమ్ 8లో దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిని తహసీల్దార్, ఎంపీ డీఓ కార్యాలయంలోగానీ అందజేయవచ్చన్నారు.

పడిలేచిన కెరటమే మనకు ఆదర్శం

రాజమహేంద్రవరం రూరల్: జీవితంలో గెలుపు ఓటమి సహజమని, ఓడినవారు పడి లేచే కెరటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం అన్నారు. సీబీఎస్ఈ ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల ఎంపికలో విజేతలుగా నిలిచిన రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులం విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని గురువారం ఆ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో అబ్రహం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని అంశాల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్ మాట్లాడుతూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల ఉన్నతికి ఉచిత విద్యను అందిస్తోందన్నారు. ప్రిన్సిపల్ కె.గురయ్య మాట్లాడుతూ సీబీఎస్ఈ నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన తమ విద్యార్థులు త్వరలో జరిగే సీబీఎస్ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందించారు. అంతకుముందు సత్యసాయి గురుకులంలో 12 అడుగుల సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బులుసు వెంకటేశ్వర్లు, అడబాల వెంకటేశ్వరరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ విజేతలతో జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆల్కాట్‌తోటలోని శ్రీరామానుజన్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల విద్యార్థులను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అభినందించారు. 12 – 14 ఏళ్ల కేటగిరిలో జరిగిన జిల్లా స్పోర్ట్స్‌మీట్–2023లో 50 మీటర్ల రన్నింగ్ రేస్‌లో గోల్డ్ మెడల్ సాధించిన దివ్యాంగ బాలుడు టి.అఖిల్ రత్నాకర్ (ఆరో తరగతి), అండర్–14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యోగా చాంపియన్‌షిప్ పోటీలలో బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి రజత పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికైన ఎం.సంజయ్ కుమార్ (8వ తరగతి), బాలికల విభాగంలో నేషనల్స్ ఫర్ ఆర్టిస్టిక్ కేటగిరిలో స్టేట్ గోల్డ్ మెడల్ సాధించిన పి.డయానా తనుశ్రీ (9వ తరగతి), అండర్ – 17 బాలికల విభాగంలో జాతీయ యోగా చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన బి.శరణ్య గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలతను కలిశారు. రామానుజన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పీకేఎస్ సత్యవతి, యోగా కోచ్, ఫిజికల్ డైరెక్టర్ జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

19న శెట్టిబలిజ వనభోజన మహోత్సవం

ప్రకాశం నగర్: శెట్టిబలిజ సంఘీయుల్లో ఐక్యతను సాధించి, రాజ్యాధికారం, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను పొందే లక్ష్యంతో ఈ నెల 19న రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శెట్టిబలిజ నాయకులు ప్రకటించారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు మేడిశెట్టి తాతబ్బాయి, ఉపాధ్యక్షుడు అప్పారి జయప్రకాష్, కార్యదర్శి ఇళ్ల శివప్రసాద్, సంఘం అనపర్తి నియోజకవర్గం నాయకుడు గుత్తుల సుబ్రహ్మణ్యం తదితరులు వనభోజన మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామారావు మాట్లాడుతూ 19న జీఎస్ రోడ్డులోని ప్రభుగారి తోటలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సుమారు 10 వేలమంది సంఘీయులు హాజరవుతారని అంచనా వేశామని ఆయన అన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘీయులు

502 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు సచివాలయం 4 పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 502 మంది వైద్యసేవలు అందించారు. ఐదుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలకు రిఫర్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు శ్రీనివాస్, శ్వేత, పీహెచ్‌సీ వైద్యులు జి.రోహిత, ఈ.నాగదేవి వైద్యసేవలందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీరాణి ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, సచివాలయ కన్వీనర్లు కేవీ సుబ్బారెడ్డి, పీవీ రమణ, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ గ్రామ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, షేక్ ఇమామ్ (బాబ్జి), మీరా పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్యులు

ఘనంగా న్యాయ సేవల దినోత్సవం

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం జాతీయ న్యాయ సేవల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టాన్ని ఏర్పాటు చేసిన రోజు నుంచీ న్యాయ సేవల దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. లీగల్ అవేర్‌నెస్, అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌లో భాగంగా ఇంటింటికీ ప్రచారం, న్యాయ విద్యా కార్యక్రమాలు, మొబైల్ వ్యాన్ అవగాహన ప్రచారాలు, న్యాయ సహాయ క్లినిక్ అవగాహన ప్రచారాలు చేస్తున్నామన్నారు. తొలుత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుంచి పుష్కరఘాట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ, ప్రశ్నా వినోదం, చిత్రలేఖనం, స్కిట్ విభాగాల్లో విజేతలైన 22 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, బూట్లు, గ్లౌజులు, యాప్రాన్లు, కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి పీఆర్ రాజీవ్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రీ దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీయూవీబీ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

కడియం: ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేశామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖాధికారి బి.సుజాత కుమారి తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, రైస్‌మిల్లర్లతో గురువారం తహశీల్దార్ కార్యాలయంలో మైత్రి కమిటీ సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం అధ్యక్షత వహించారు. తహసీల్దార్ ఎం.సుజాత మాట్లాడుతూ రైతులు నేరుగా తమ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకునేందుకు ఏడు చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారన్నారు. సిబ్బంది ఏర్పాటు, గోనె సంచులు తదితర వాటిని ముందుగానే కల్పించామన్నారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ డివైజ్‌లను అమర్చడం జరిగిందన్నారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులకు సమస్య ఎదురైతే వెంటనే మైత్రి కమిటీ దృష్టికి గానీ, కంట్రోల్ రూమ్ నంబర్‌కు గానీ ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చన్నారు. కాగా.. ఇటీవల మృతి చెందిన మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు ఈలి శ్రీనుకు సంతాపం తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. క్వారీ మార్కెట్ ప్రాంతంలో భీమన గౌరిని అరెస్టు చేసి, ఆమె నుంచి 180ఎంఎల్ ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటిలిజెన్స్‌టీమ్ సోమాలమ్మ గుడి ప్రాంతంలో వాసంశెట్టి వెంకటలక్ష్మిని అరెస్టు చేసి, ఆమె నుంచి 180 ఎంఎల్ ఐదు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుందన్నారు. నిందితులు ఇద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పీవీ రమణ తెలిపారు.

జాంపేట బ్యాంకుకు ఎన్నికలు జరపాలి

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ఎన్నికలు జరపాలని దేవాంగ నేతలు కటకం మల్లికార్జునరావు, బూడిద శరత్ కుమార్, పింజర్ల సూర్య ప్రభాకరరావు, బీర శ్రీనివాస్ రాజు, జి. సత్యనారాయణ ప్రసాద్, కొమ్మన వీర్రాజు, నల్లా శివ శంకరరావు, కాశిన వెంకట అప్పారావు, అల్లాడ అప్పలరాజు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. బ్యాంకు చైర్మన్‌గా ఉన్న బొమ్మన రాజ్‌కుమార్ పాలక వర్గం కాలపరిమితి 2021లో ముగిసే కాలంలో ఆయన మరణించారన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి బొమ్మన రాజ్‌కుమార్ తనయుడు జయకుమార్‌ను చైర్మన్ చేసి, పాత కార్యవర్గాన్నే కొనసాగించారన్నారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకూ ఆరు నెలలకు ఒకసారి పాత కార్యవర్గాన్నే కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. మళ్లీ ఇప్పుడు పాలకవర్గ కాలం తీరిపోయిందన్నారు. ఎన్నికలు జరపకుండా పాలకవర్గాలను కొనసాగిస్తూ పోతే అవినీతి, అక్రమాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు.



